# పేగు

"అమ్మని నాన్నని చూసినట్లు ఉంటుంది, తమ్ముడికెలా ఉందో తెలుసుకున్నట్లు ఉంటుందనుకుని భర్తను ఒప్పించి ఒంటరిగా పుట్టింటికి బయలుదేరింది పూర్ణిమ.

ఊళ్ళో దిగేటప్పటికి దీపాలు పెట్టారు.

ఎడ్రస్ చెప్పి ఆటో ఎక్కింది.

తీరా గుమ్మంలో కాలు పెట్టేసరిగి కొత్త మొహాలు అగుపించాయి. హతాసురాలైంది పూర్ణిమ.

ఆరా తీయగా తండ్రి ఇల్లు అమ్మేసి వెళ్ళిపోయాడని తెలిసింది. వాళ్ళిప్పుడెక్కడుంటున్నారని అడిగింది.

చెప్పారు.

వచ్చిన ఆటోలో మళ్ళీ ఎక్కి కూర్చుంది. ఏవో సందులుగొందులు దాటి ఇక ఇల్లు కనుక్కోవడం నీ వంతు అన్నట్లు ఓ చోట ఆగిపోయింది ఆటో.

ఆటోవాడికి డబ్బులిచ్చి క్రిందికి దిగింది. పరిసరాలను పరిశీలనగా చూసింది. ఆడుకుంటున్న పిల్లలు ఆమె చుట్టూ చేరి వింతగా చూస్తున్నారు. బీద బిక్కి నివసించే లొకాలిటి అది. ఆ ఏరియాలో అన్నీ కమ్మరిళ్ళే. అక్కడొకటి అక్కడొకటి విసిరేసినట్లు రెండు పుంజీలు పెంకుటిళ్ళున్నాయి. వాటిల్లో తన కన్నవాళ్ళు ఎక్కడుంటున్నారో

ఏమిటో! ఎవర్ని భోగట్టా చేయాలో తెలీక అటు ఇటు చూసింది.

ఉన్నట్లుండి ఆమె దృష్టి ఓ తాటాకుల గుడిసె ముందు మంచంవేసుకుని కూర్చున్న వ్యక్తిమీద పడింది. అతడు తన తండ్రేనని నిర్ధారించుకుని గభాలున దగ్గరకెళ్ళింది.

చెప్పపెట్టకుండా ఊడిపడ్డ కూతుర్ని చూసి ఆశర్యపోయాడు రామదాసు.

"ఏమిటమ్మా పూర్ణిమ ఒంటరిగా ఈవేళప్పుడొచ్చావు. అల్లుడుగారు రాలేదా" అడిగాడు లేచి నిలబడి.

అతడి కంఠంలో కంగారు ధ్వనిస్తోంది.

మనసేదో కీడును శంకిస్తోంది.

"లేదు నాన్నా ఆయన రాలేదు. నిన్ను తమ్ముణ్ణి చూడాలనిపించింది నేనొక్కర్తినే వచ్చాను. రాజుకెలా వుంది? హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయివచ్చేసాడా? బస్సు దిగు తూనే మన ఇంటికెళ్ళాను. మీరు ఇల్లు అమ్మే సుకుని వెళ్లిపోయారని చెప్పారు" అన్నది పూర్ణిమ.

కూతురి నోటంట ఏ వార్త వినవలసి వస్తుందోనని హడలి చచ్చిన రామదాసు 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. సమాధానంగా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.                వాళ్ళ మాటలు విని బయటకొచ్చింది సుమలత.

తల్లిని వాటేసుకని కంట తడిపెట్టింది పూర్ణిమ.

లోపలకు అడుగుపెడుతూనే "ఎందుకు చేసావీపని?" అంటూ తండ్రిని నిలదీసింది.

ఆ మాట అంటున్నప్పుడు ఆమె గొంతు జీరబోయింది. అమ్మ. నాన్న గుడిసెలో ఉంరడటం చూడలేకపోతోంది.

"ఏం చేయను తల్లీ అయినవాళ్ళకు అక్కర్లేకపోయినా, తోడబుట్టినవాళ్ళు కాదనుకున్నా కనుకున్నవాడికి తప్పదు కదమ్మా. అందుకే ఇల్లు అమ్మవలసి వచ్చింది" కూతురికి సమ్జాయిషి ఇచ్చుకున్నాడు రామదాసు.



అతడి చర్య సమంజసమా కాదా అన్నది నిర్ధారించాలంటే గతంలోకి వెళ్ళక తప్పదు.

బట్టల షాపుల్లో పద్దులు రాస్తూ, ఇంటింటికి డైరీ పాలు పంచుతూ కాలం వెళ్ళదీస్తున్నాడు రామదాసు. అతడికి ముగ్గురు సంతానం. కుటుంబాన్ని పోషించేందుకు అతడు చేయని పని లేదు. రెక్కలు ముక్కలు చేసుకుని కొడుకుల్ని ఎలాగో డిగ్రీవరకు చదివించాడు. పూర్ణిమకు పెళ్ళి చేసాడు. పెద్దవాడు ప్రసాద్ ఓ ప్రవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్నవాడు రాజు ఏవో ఇన్సురెన్సులు చేయిస్తూ వచ్చిన కమిషన్‌తో రాజాలాగ బ్రతికేస్తున్నాడు. జీవితంలో ఎగుడుదిగుడులన్నిటిని చవిచూసిన రామదాసు ఐదోపడిలోనే అలసిపోయి ఒంట్లో ఓపిక సన్నగిల్లడంతో మరి పనిలోకి పోలేదు. ఒకసారి హార్ట్‌ఎటాక్ రావడంవల్ల అతడు పనిలోకి వెళతానన్నా వెళ్ళనివ్వదు సుమలత.

నాన్న ఎక్కడ డబ్బు అడుగుతాడోనని ఇంటి కొచ్చినప్పుడెల్లా తన ఇబ్బందుల్ని ఏకరవు పెడ తాడు ప్రసాద్ అన్నయ్యకు తనేమాత్రం తీసిపోనన్నట్లు వ్యవహరిస్తాడు రాజు. తను అస్వతంత్రురాలవడం వల్ల, ఆర్జనపరురాలు కాక పోవడం వల్ల కన్నవాళ్ళని ఆదుకోలేక పోతున్నానని బాధపడుతుంది పూర్ణిమ. ఏది ఏమైనా బిడ్డలు తన మీద ఆధారపడకుండా వాళ్ళ మానాన వాళ్ళు హాయిగా బ్రతుకుతున్నందుకు తృప్తిగానే ఉంది రామదాసుకు. ఇక కూడుకోసం గూడును రెండుగా చీల్చి ఒక గది అద్దెకిచ్చి వచ్చిన డబ్బులతో దినం తీర్చుకుంటున్నారు రామదాసు దంపతులు.

ఉన్నట్లుండి పులిమీద పుట్రలా రాజుకి యాక్సిడెంటయిందన్న పిడుగులాంటి వార్త చెవిని పడటంతో నిలువునా కంపించిపోయాడు రామదాసు స్కూటరు మీంచి పడటంవల్ల కాళ్ళకు పెద్ద దెబ్బలే తగిలాయి.

స్పృహ కోల్పోయింది సుమలత.

కాస్సేపటికి తేరుకుని కొడుకును చూసేందుకు ఇద్దరూ హాస్పటల్‌కు బయలుదేరారు. బెడ్ మీద చలనం లేకుండా పడివున్న బిడ్డను చూసి లబోదిబోమంది సుమలత.

రామదాసు పైకి ఏడవలేక లోలోపలే దుఃఖాన్ని దిగమింగుకుంటున్నాడు.

ప్రాణానికి ముప్పేంలేదంటూ ధైర్యం చెప్పాడు డాక్టరు.

వర్తమానం అందుకుని ఆఘమేఘాల మీద వాలాడు ప్రసాద్.

ఉన్నపళంగా పెనిమిటితో ఊడిపడింది పూర్ణిమ.

అయినవాళ్లంతా వచ్చారు.

చూసారు.

కన్నీరు కార్చారు.

రాజుకు ఆపరేషను అనివార్యమన్నారు వైద్యులు. విరిగిన కాళ్ళు అతుక్కోవాలంటే స్టీల్ రాడ్స్ అమర్చవలసి ఉంటుందని, పూర్తిగా నయమయేంతవరకు అతడు హాస్పటల్‌లోనే ఉండవలసి ఉంటుందని ఖర్చు సుమారు లక్ష రూపాయలు అవుతుందని చెప్పారు. రామదాసుకు మతిపోయింది. ఇప్పటికిప్పుడు అంత డబ్బు ఎక్కడ నుండి పట్టుకురావాలో తెలియడంలేదు. రాజువద్ద పైసా లేదు. అప్పు చేద్దామన్నా ఇచ్చే దాత ఎవరు? తన బొక్కి ఇల్లు తాకట్టు పెడదామన్నా ఏ వడ్డీ వ్యాపారి అంత మొత్తం ఇవ్వడు.

ఏం చేయాలో తోచక పెద్దకొడుకును కదిపి చూసాడు.

“నా సంపాదన నా ఖర్చులకే సరిపోవడం లేదు. అంత డబ్బు నేనెక్కడ నుంచి తెచ్చేది?” అంటూ తన అసక్తతను వ్యక్తం చేసాడు ప్రసాద్.

రామదాసు హృదయం చివుక్కుమంది.

“ఖర్చంతా నిన్నే భరించమని నేననడంలేదు తలొకరు తలో చెయ్యి వేస్తే రాజుకు కాళ్ళు వస్తాయి. వాడెవడో కాదు నీ తమ్ముడు. నీ రక్తం పంచుకుని పుట్టాడు”

అంటూ ఆక్రోసించాడు.

అయినా అతడి నుండి మౌనమే సమాధానం లభించింది.

చివరిగా అల్లుడి వంక ఆశగా చూసాడు.

"చూడటం అయింది కదా! ఇక పద" తనెక్కడ సహాయం చేయవలసి వస్తుందోనని పెళ్ళాని ప్రయాణానికి తొందర పెట్టాడు ప్రణయ్.

అల్లుడి అంతరంగం తేటతెల్లమైపోవడంతో మరి మాట్లాడలేదు రామదాసు.

బిడ్డలు తమని ఆదరించినా, అవమానించినా వాళ్ళ అభివృద్ధినే వాంఛిస్తారు కన్నవాళ్ళు. అది కడుపుతీపి. కొడుకు వైద్యానికి సహాయం చెయ్యమని బాగా తెలిసిన వస్త్ర వ్యాపారస్తుల్ని ఆశ్రయిచాడు. ఆదుకోమని సన్నిహితుల్ని వేడుకున్నాడు. అతడి స్థితికి ఏ గుండె కరగలేదు. ఏ మనసు స్పందించ లేదు. రాజు ఎవరికీ అఖ్కర్లేదు. కాని తనకు కావాలి ఎందుకంటే వాడు తన పేగు. . . తన రక్తం. . . తన ప్రాణం. . . వాడికోసం ఏం చెయ్యాలన్నా తనే చెయ్యాలి. అందుకే ఉంటున్న నీడనే అమ్ముకున్నాడు. ఎంతటి దుర్భరమైన జీవితాన్నైనా గడపటానికి సిద్ధపడ్డాడు. తన చర్యని కూతురు సమర్థిస్తుందా? పెద్ద కొడుకు హర్షిస్తాడా? కొంప అమ్ముకుంటే లోకం ఏమనుకుంటుంది? అన్నవి తనకు అనవసరం. కావలసిందల్లా తన బిడ్డ శ్రేయస్సు.

**(19 మార్చి 2006 ఆంధ్రభూమి డైలి ఆదివారం అనుబంధం)**